బాలికపై లైంగికదాడికి పాల్పడిన కృష్ణారెడ్డిని కఠినంగా శిక్షించాలి

ఎర్రకుంట తండాలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కల్యాణ్‌నాయక్ తదితరులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 16 : గిరిజన బాలికపై లైంగిక దాడి చేసిన కృష్ణారెడ్డి, అతడికి సహకరించిన వారిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపి త్వరగా శిక్షపడే విధంగా అధికారులు చొరవతీసుకోవాలని బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం శంషాబాద్ మండలంలోని ఎర్రకుంట తండాలో బాధిత కుటుంబ సభ్యులను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎడాది నుంచి బాలిక ఇద్దరు బంధువులు కలిసి జూకల్ గ్రామంలో మన్నె కృష్ణారెడ్డికి వ్యవసాయ పనులు చేయడానికి వెళ్తుంది. అయితే బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో కృష్ణారెడ్డి భయపెట్టి ఆరు నెలల నుంచి లైంగికదాడికి పాల్పడినట్లు తెలిపారు. ఈ నెల 13 తేదీన కొత్తూరు మండల కేంద్రంలోని శ్రీనివాస క్లినిక్‌లో రంజీత్‌రెడ్డి అనే నకిలీ డాక్టర్ చేత గర్భశ్రావం చేయించినట్లు తెలిపారు. వీరితో పాటు బాలికకు న్యాయం చేసే విధంగా సంబంధిత అధికారులు చొరవతీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎస్సీమోర్చా అధ్యక్షుడు బాణావత్ సాయిలాల్‌నాయక్, శంషాబాద్ మండల అధ్యక్షుడు కొర్ర రవినాయక్, రమేశ్‌నాయక్, దేవేందర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఏపీ అమెరికన్ అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్‌గా గిరీష్

వెంగళరావునగర్, ఆగస్టు 16 :ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్(ఏఏఏ) నేషనల్ ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా ఇయ్యపు గిరీష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సంస్థ శుక్రవారం ప్రకటన వెలువరించింది ఏపీవాసుల కోసం మోతుపల్లి శ్రీహరి స్థాపించిన మొట్ట మొదటి ఏకైక జాతీయ సంస్థ ఏపీ అమెరికన్ అసోసియేషన్ అని వారు తెలిపారు. ఆమెరికాలోని పది రాష్ట్రాల్లో దీని కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా వైజాగ్‌కు చెందిన గిరీష్ అయ్యపు మాట్లాడుతూ తనకు ఈ అవకాశం రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

సర్దార్ పాపన్న జయంతి, వర్ధంతి కమిటీ కన్వీనర్‌గా భాస్కర్‌గౌడ్

బండ్లగూడ, ఆగస్ట్ 16 : సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 41 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీలో అత్తాపూర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ముద్దగోని భాస్కర్‌గౌడ్‌ను కన్వీనర్‌గా నియమించింది. ఈ సందర్భంగా భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతను అంకిత భావంతో నిర్వహిస్తానని తెలిపారు.

రోడ్లపైనే వరదనీరు

- వర్షం పడినప్పడల్లా ఇదే పరిస్థితి
- పత్తాలేని పారిశుధ్య సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



పీరం చెరువు నాలాను మూసి వేయడంతో రోడ్డుపై నిలిచిన నీరు

బండ్లగూడ, ఆగస్టు 16 : శుక్రవారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయ్యాయి. దీంతో వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సహాయక చర్యలు చేపట్టవలసిన మాన్‌సూన్ స్విబంది పత్త లేకుండా పోవడంతో రోడ్లపై నీరు నిలిచి వాహన దారులకు తలనొప్పిగా మారింది. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం వర్షం కురిసిన వర్షానికి రోడ్లపైకి నీరు చేరింది. అనేక ప్రాంతాలలో చెరువులు, కుంటలకు వచ్చే నాలాలను మూసివేసి అక్రమ నిర్మాణాలను చేపడుతుండటంతో రోడ్లపైనే నీరు నిలుస్తున్నది. దీంతో నిత్యం రద్దీగా ఉండే బీజాపూర్ హైవే ట్రాఫిక్ జామ్ తో వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. పోలీస్ అకాడమీ నుంచి వచ్చే వర్షనీరు ప్రతి యేడు పీరం చెరువులోకి దూసుకు వచ్చేవి. కాగా అక్కడ కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతుండడంతో వర్షం నీరు రోడ్డుపైకి చేరుతుంది. జీఆర్‌కే గార్డెన్ వద్ద వర్షం నీరు భారీగా ఎర్రకుంటలోకి వచ్చేవి.అక్కడ కూడా నిర్మాణాలు చేపట్టడంతో వర్షం నీరు భారీ స్థాయిలో రోడ్డుపై నిలిచి ఉంటుంది. దీంతో వాహన దారులు, ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

జీఆర్‌కే వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

కోల్‌కత్తా ఘటనను నిరసిస్తూ.. ర్యాలీ

- స్తంభించిన నిమ్స్ ఓపీ సేవలు
- ఎమర్జెన్సీ విభాగానికి మినహాయింపు
- నేటి నుంచి నిరసనలో ఫ్యాకల్టీ

కోల్‌కత్తా ఘటనను నిరసిసస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఖైరతాబాద్, ఆగస్టు 16 : వైద్యులు, సిబ్బంది నిరసనలతో నిమ్స్ స్తంభించిపోయింది. రెసిడెంట్ వైద్యుల సంఘం ఇచ్చిన పిలుపున మేరకు 48 గంటల నిరసన కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఓపీ సేవలతో పాటు శస్త్రచికిత్సలను నిలిపివేశారు. సుమారు 400 మందికిపైగా వైద్య సిబ్బంది తమ విధులను బహిష్కరించి ఆందోళన బాటపట్టారు. నిమ్స్ దవాఖానకు ప్రతి రోజూ 3వేల మందికిపైగా రోగులు వివిధ చికిత్సల కోసం వస్తుంటారు. శుక్రవారం 34 విభాగాలకు చెందిన వైద్య, ఇరత సిబ్బంది ఆయా సేవలను బహిష్కరించి నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. అన్ని రకాల ఓపీ సేవలను నిలుపుదల చేయగా, పలు ఎంపిక చేసిన శస్త్రచికిత్సలను సైతం ఆపారు. అయితే ముందస్తుగా ప్రకటన ఇవ్వడంతో చికిత్స కోసం వచ్చే రోగులు సంఖ్య తగ్గిపోయింది. నిరసన కార్యక్రమంలో నిమ్స్ నర్సింగ్, పారామెడికల్ అసోసియేషన్ నుంచి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నేటి నుంచి ఫ్యాకల్టీ అసోసియేషన్ సంఘీభావంగా పాల్గొంటున్నట్లు ప్రకటించడంతో ఈ మేరకు శుక్రవారం నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ సర్క్యూలర్ జారీ చేశారు. నేడు ఎమర్జెన్సీ తప్ప అన్ని రకాల విబాగాలు తమ సేవలను నిలిపివేయనున్నాయి. అత్యవసర విభాగంతో పాటు 18 ఐసీయూ విభాగాలకు 24గంటల పాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైద్యులు

నిరసన ర్యాలీ సాగిందిలా..

కోల్‌కత్తా ఘటనను నిరసిస్తూ సుమారు 400 మంది వైద్య, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది నిమ్స్ పంజాగుట్ట గేటు నుంచి నాగార్జున సర్కిల్ మీదుగా, బంజారాహిల్స్ రోడ్ నం.1లోని రెండో గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. నిమ్స్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ కిరణ్ ఇమ్మడి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా వైద్యులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. కోల్‌కత్తాలోజరిగిన ఘటన అత్యంత అవమానీయమని, నింధితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలన్నారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత రాజశేఖర్‌రెడ్డి ఓ బిల్లును తీసుకువచ్చారని, వైద్యశాలల వద్ద త్రీ టైర్ ప్రొటెక్షన్ ఇవ్వాలన్నది దాని ఉద్దేశమన్నారు. అది డ్రాఫ్ట్ రూపంలో ఉండగా, కార్యాచరణకు నోచుకోలేదన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారని, దానిని పాస్ చేసి అమలు చేస్తే ఇలాంటి ఘటనలను నివారించ వచ్చని అన్నారు. రెసిడెంట్ డాక్టర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షాహిర్‌రెడ్డి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లను సహించేది లేదు

- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రౌడీయిజం పెరిగింది
- వెంగళ రావునగర్ కార్పొరేటర్ దేదీప్య

యాదగిరినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ దేదీప్య, బల్దియా అధికారులు

వెంగళరావునగర్, ఆగస్టు 16 : ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తూ చేసే అక్రమ వసూళ్లను సహించబోమని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య అన్నారు. శుక్రవారం యాదగిరినగర్‌లో బల్దియా, ట్రాఫిక్ సిబ్బందితో కలిసి ఆమె పర్యటించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ..వీధి వ్యాపారాలు, దుకాణాల నుంచి బస్తీ అభివృద్ధి పేరిట రూ.500 నుంచి రూ.5 వేలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఫుట్‌పాత్‌ల పై డబ్బాలు పెట్టించి నెల వారీగా మామూళ్లు వసూలు చేస్తున్నారని..ఇలాంటి వారిని వదిలి పెట్టబోమని ఆమె హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి రౌడీయిజం పెరిగిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా అధికారులు, సిబ్బంది, డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాన్ని మానుకోవాలి

డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాముయాదవ్

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 16 : తెలంగాణ ఉద్యమ చరిత్ర కలిగిన బీఆర్ఎస్ పార్టీపై అసత్య ప్రచారం చేస్తున్న వారికి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడుతున్నాయని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు రాముయాదవ్ అన్నారు. బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ అనుకూల సోషల్ మీడియా, యూట్యూబ్ చానెల్స్ పని గట్టుకొని విష ప్రచారానికి దిగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పది మంది ఎమ్మెల్యేలు వెళ్తున్నారని, ప్రతిపక్ష హోదా కూడా లేకుండా బీఆర్ఎస్ పార్టీ కుదేలవుతుందని ప్రచారం చేస్తున్నారన్నారు. అలాగే ఇటీవల బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం అవుతుందంటూ మరో అసత్య ప్రచారానికి కాంగ్రెస్ అనుకూల సోషల్ మీడియా అడ్డగోలు ప్రచారం చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ పార్టీ అని, సుమారు 50 లక్షలకు పైగా సభ్యత్వం కలిగి ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పునాదులు గట్టిగా ఉన్నాయని తెలిపారు. శిక్షితులైన కార్యకర్తలు, అంతకు మించిన నాయకత్వం ఉన్నదని, కేసీఆర్, కేటీఆర్‌లను తట్టుకునే శక్తి ఏ పార్టీకి లేదన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా గెలిచే పార్టీ బీఆర్ఎస్ అని ఆయన అన్నారు.

దుర్గారావుపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 16 : శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న దుర్గారావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మధునగర్ కాలనీకి చెందిన పాపారాయుడు శంషాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న వారికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్న దుర్గారావు తాను అద్దెకు ఉంటున్న ఇంటికి మాత్రం ప్రతి రోజూ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. స్పందించిన కమిషనర్ సుమన్‌రావు విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పీజీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్ష ఫీజు గడువు పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: ఓయూ పరిధిలోని వివిధ పీజీ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలి, కాల పరిమితి పూర్తైన వారికి కల్పించిన వన్‌టైమ్ చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎస్ డబ్ల్యూ, ఎంకామ్ (ఐఎస్), ఎంలిబ్ఐఎస్సీ, బీలిబ్ఐఎస్సీ, ఎంసీజే, బీసీజే కోర్సుల్లో 2000 ఏడాది తరువాత చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్ష ఫీజును వచ్చే నెల 28లోగా చెల్లించాలని సూచించారు. రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 4గా చెల్లించవచ్చని చెప్పారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్ష విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షలు అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎమ్మెస్సీ డేటా సైన్స్ పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని ఎమ్మెస్సీ డేటా సైన్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

నాయీబ్రాహ్మణులకు న్యాయం చేయాలని వినతి

మణికొండ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న మణికొండ నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

మణికొండ, ఆగస్టు 16: అనేక ఏండ్లుగా కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న నాయీబ్రాహ్మణులను ఇబ్బందులకు గురి చేస్తున్న వివిధ సంస్థలపై చర్యలు తీసుకోవాలని మణికొండ నాయీబ్రాహ్మణ వృత్తిదారులు అన్నారు. నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మణికొండ మున్సిపాలిటీ కమిషనర్‌తో పాటు రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్ల నుంచి మణికొండలో ఉంటూ కులవృత్తి అయిన మంగళి షాపులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. గ్రామంలో పుట్టిన దగ్గర నుంచి చావు వరకు జరుగుతున్న అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మధ్య కొన్ని పెద్ద సంస్థలు బ్రాండెడ్ సెలూన్‌లు ప్రారంభించి మా వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. మాపై దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. ఈ వృత్తి తప్ప ఇంకా వేరే జీవనాధారం లేని తమకు న్యాయం చేయాలని అన్నారు. మణికొండ మున్సిపల్ నాయీ బ్రాహ్మణ సంఘంలో బైలాస్ ప్రకారం ఒక సెలూన్ షాపు నుంచి మరొక షాపుకు 500 ఫీట్లు దూరం పాటిస్తున్నామన్నారు. ఈ మధ్య మణికొండ మున్సిపాలిటీలో ఇతర కులానికి సంబంధించిన వారు కూడా యూనిక్ సెలూన్ పెట్టి వ్యాపారం చేస్తున్నారన్నారు. వీరికి ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేయవద్దని అలాగే 500 ఫీట్ల దూరాన్ని పాటించాలని, నిబంధన పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ వై.నరేశ్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ పురుశోత్తం, వర్కింగ్ ప్రెసిడెంట్ సంగం కిరణ్‌కుమార్, సీనియర్ నాయకులు మహేశ్, ఆశోక్, రాజు, ఎస్.శ్రీనివాస్, బాబూరావు, అనిల్, ప్రవీణ్, శ్రీకాంత్, భరత్‌కుమార్, ప్రశాంత్, గోపాల్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా ది సిజిజన్స్ కౌన్సిల్

ముస్లిం శ్మశానవాటికకు ఐదు ఎకరాలు కేటాయించేలా కృషి

మణికొండలో ముస్లిం శ్మశానవాటిక ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్న సభ్యులు

మణికొండ, ఆగస్టు 16: మణికొండ మున్సిపాలిటీలో అన్ని వర్గాల ప్రజలకు కావాల్సిన సదుపాయాలను కల్పించేందుకు ది సిటిజన్స్ కౌన్సిల్ కృషి చేస్తుందని కౌన్సిల్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ తెలిపారు. మణికొండ పరిసర పరిధిలో ముస్లిం శ్మశానవాటిక లేకపోవడంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సయ్యద్ జాఫర్ అహ్మద్, ది సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి విన్నవించామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి కలెక్టర్‌కు సమస్యను వివరించడంతో జాయింట్ యాక్షన్ కమిటీ సహకారంతో ఎట్టకేలకు మణికొండ సర్వే నంబర్ 44లో ఐదు ఎకరాల భూమిని ముస్లిం శ్మశానవాటికకు కేటాయించడం జరిగిందన్నారు. స్థానిక తాసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. కౌన్సిల్ కార్యదర్శి షేక్ ఆరిఫ్ మొహమ్మద్ ఆధ్వర్యంలో సహకరించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కలెక్టర్, సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఆశిం మొహ్మద్, సయ్యద్ ఫజల్, సముద్దీన్ సాహెబ్, తక్డీర్ భాషా, ఖాజా మొహియుద్దీన్, ముఖ్యార్ సాహెబ్, ఇబ్రహీం, అందె లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి నివాళి ..

హైదర్‌గూడ చౌరస్తా వద్ద నిర్వహించిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 16: భారతదేశ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 6వ వర్ధంతి కార్యక్రమాన్ని హైదర్‌గూడ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్ అధ్యక్షతన అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి హాజరై అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ శ్రేయస్సు కోసం అటల్ బిహారీ వాజ్‌పేయి ఎనలేని సేవ చేశారన్నారు. పేద ప్రజలకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదరిక నిర్మూళనకు కృషి చేసిన మహనీయుడని గుర్తు చేశారు. అలాంటి నాయకుడు ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోండ్ర కొమురయ్య, కాడెం సుధాకర్, రాచూరి రాజశేఖర్, కె.కిరణ్‌చారి, సులిగే వెంకటేశ్, కాకులారం కృష్ణ నల్లింగ్ రమేశ్, బి.సిద్ధేశ్వర్, మోండ్ర నర్సింహ, పుస్తకాల ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్ వెళ్లేందుకు ఎయిర్‌పోర్టుకు దేవినేని అవినాష్

తిరిగి పంపించిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 16 : హైదరాబాద్ నుంచి దుబాయ్ వెళ్లేందుకు దేవినేని అవినాష్ యత్నించడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు నిరాకరించారు. ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపిన ప్రకారం. ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలో టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన కేసులో దేవినేని అవినాష్‌పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే అతడు దుబాయ్ వెళ్లడం కోసం యత్నించగా అప్పటికే లుకౌట్ నోటీలు జారిచేసిన మంగళగిరి పోలీసులు అతడి ప్రయాణాన్ని నిరాకరించి తిరిగి పంపించారు. దీంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దేవినేని అవినాష్ తిరిగి వెళ్లిపోయారు.

130 ఏండ్లుగా పీఎన్‌బీ సేవలు

దేశంలో130 ఏండ్లుగా పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) సేవలను అందిస్తోందని డిప్యూటీ జోనల్ మేనేజర్ సంజయ్ గోవింద్ రావ్ మానే అన్నారు. 78వ స్వాతంత్ర్య దిన వేడుకలను హైదరాబాద్ జోనల్ కార్యాలయంలో బ్యాంకు ఉద్యోగులతో కలిసి ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సంజయ్ గోవింద్ రావ్ మాట్లాడుతూ పంజాజ్ నేషనల్ బ్యాంకును స్థాపించిన వ్యవస్థాపకులు కన్న కలలను నిజం చేయాలన్న లక్ష్యంతో ఉద్యోగులంతా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా బ్యాంకులో చిన్న పిల్లలకు పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాజ్‌కుమార్ సిన్హా వెంకట క్రిష్ణన్, సి.వి.రావు, వాసుదేవరావు, శ్యామ్ కుమార్, మిలింద్, చీఫ్ మేనేజర్స్ నరేన్ దత్తా, శరత్ కుమార్, నిదీశ్, డాక్టర్ సాకేత్ సహాయ్, సతీశ్ కుమార్, జోగినాథ్ సాహు సిబ్బంది పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ)

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన వాక్

మాంటి ప్రొడక్షన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నెక్లెస్ రోడ్‌లో గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన వాక్ నిర్వహించారు. ఈవాక్‌ను ఏసీపీ పూర్ణచందర్ రావు, స్కూప్స్ ఇండియా జనరల్ మేనేజర్ శివా రెడ్డి, నిర్వాహకులు అతుల్ సురేశ్‌తో కలిసి ప్రారంభించారు.

– ఖైరతాబాద్, ఆగస్టు 16

మెట్రో బోగీలను పెంచాలి

- ప్రయాణికులకు సరిపడా ఆర్టీసీ బస్సులు రెట్టింపు చేయాలని డిమాండ్

మారేడ్‌పల్లి, ఆగస్టు 16: మెట్రో రైల్ బోగీలను 3 నుంచి 6కు పెంచాలని, ఆర్టీసీ బస్సుల సంఖ్యను రెట్టింపు చేయాలని, ఎంఎంటీఎస్ లోకల్ రైళ్లను పెంచాలని కోరుతూ సీపీఎం గ్రేటర్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రెజిమెంటల్‌బజార్‌లో కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ చేపట్టారు. సికింద్రాబాద్ జోన్ కమిటీ కార్యదర్శి ఎం.అజయ్ బాబు మాట్లాడుతూ గ్రేటర్ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ అదేస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదన్నారు. నగరంలో బస్సులు, ఎంఎంటీఎస్, మెట్రో రైళ్ల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నగరంలో మెట్రో రైలు మూడు బోగీలతోనే నడుస్తున్నదని, వాటిని ఆరు బోగీలకు పెంచాలని కోరుతున్నప్పటికీ మెట్రో రైల్ నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. మెట్రో రైలు బోగీల పెంపు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ నాయకులు వెంకటేశ్, రమేశ్, నరేశ్ పాల్గొన్నారు.

నేడు కరెండు ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 16 : విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా మైలార్‌దేవ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 11.30 నుంచి ఒంటి గంట వరకు

అబ్దుల్లా కాలనీ ఫీడర్ పరిధిలో.. అబ్దుల్లా కాలనీ, రాజీవ్ గాంధీనగర్, ఇడ్లీహోటల్, మిలాన్ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి, ఐడీఏ ఇండస్ట్రియల్ ఏరియా, క్రిస్టల్ టౌన్, రెహమత్ కాలనీ, దస్తగిరి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు

గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మీనాక్షి ఫీడర్‌లో సాతంరాయి విలేజ్, మీనాక్షి పేపర్ మిల్, సాతంరాయి ధర్మ వెయిట్ బ్రిడ్జి, సాతంరాయి ఇండస్ట్రియల్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారు.

మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు

సాతంరాయి విలేజ్ ఫీడర్ పరిధిలో.. బీఈ లిమిటెడ్, పాశం బండ, సుచిత్ర ఇండియా, రాజీవ్ గృహకల్ప, మంజీరా కండెక్టర్, వీఎన్ఆర్ వెంచర్ ప్రాంతాలు.

**ఉదయం 11 నుంచి 11.30